గవర్నర్ పర్యటన ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి-అరకులోయ: ఈనెల 15న రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ అరకులోయలో పర్యటించనున్న నేపథ్యంలో ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ సోమవారం ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన అరకులోయలో మాట్లాడుతూ, కేంద్ర రాష్ట్ర, ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై మూడు వాహనాలు ఏజెన్సీ మండలాలోని పంచాయతీలో పర్యటిస్తాయని చెప్పారు. గిరిజన సంస్కృతి, సాంప్రదాయాలపై కార్ని వాల్ నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఎ సహాయ ప్రాజెక్టు అధికారులు వీఎస్ ప్రభాకర్, ఎం.వెంకటేశ్వరరావు, గిరిజన సంక్షేమ శాఖ ఉపసంచాలకులు ఐ. కొండల రావు, మ్యూజియం క్యూరేటర్ మురళి పాల్గొన్నారు.

పరిశీలిస్తున్న పిఒ

అనంతగిరిలో టూరిజం కార్మికుల సమ్మెకు మద్దతుగా శిబిరంలో కూర్చున్న జెడ్పిటిసి గంగరాజు, తదితరులు

సమస్యలు పరిష్కరించే వరకూ..

సమ్మె విరమించేది లేదు

- తేల్చిచెప్పిన ఎపి టూరిజం కార్మికులు

ప్రజాశక్తి- అరకు లోయ, అనంతగిరి: అధికారులు తమ సమస్యలను పరిష్కరించే వరకూ సమ్మెను విరమించేది లేదని ఎపి టూరిజం కార్మికులు తేల్చి చెప్పారు. సమ్మెతో అరకులోయలోని మయూరి హరిత రిసార్ట్, హరిత వ్యాలీ రిసార్ట్, అనంతగిరి మండలంలోని బొర్రా గుహలు, ట్రైడా జంగిల్ బెల్స్, అనంతగిరి హరిత హిల్ యూనిట్లు మూతపడ్డాయి. తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏపీ టూరిజం కార్మికులు చేపట్టిన సమ్మె సోమవారంతో మూడో రోజుకు చేరింది. సమ్మె ఉధృతంగా కొనసాగుతుంది. ఈనెల 15న ఏపీ గవర్నర్ అరకులోయ పర్యటన ఖరారు కావడం, పర్యాటక శాఖ అతిథి గృహాలు రెస్టారెంట్లు మూతబడి ఉండడంతో అధికారులు ఉరుకుల పరుగులు తీస్తున్నారు. టూరిజం కార్మికులు అధికారుల మాయమాటలను నమ్మడం లేదు. గవర్నర్ వచ్చినా సమ్మె కొనసాగించి తీరుతామని వారు స్పష్టం చేస్తున్నారు. వేరే ప్రాంతం నుంచి వర్కర్లను తీసుకొచ్చి పనులు చేయిస్తామని కొందరు అధికారులు బెదిరింపులకు పాల్పడినప్పటికీ కార్మికులు తిప్పికొట్టారు. అరకులోయలోని హరిత వ్యాలీ రిసార్ట్సులోని సమ్మె శిబిరంను ఐటిడి పీఓ అభిషేక్ సందర్శించారు. తమ న్యాయపరమైన డిమాండ్లను తక్షణమే టూరిజం యాజమాన్యంతో చర్చించి పరిష్కరించాలని పాడేరు ఐటిడిఏ పిఓపి కార్మికులు కోరడంతో పాటు వినతిపత్రం సమర్పించారు. అధికారులు, కార్మిక సంఘాల నాయకులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి చర్చిస్తామని చెప్పారు. అనంతగిరిలోని కార్మికులు థింసా నృత్యాలతో నిరసన చేపట్టారు. ఈ సమ్మెకు జెడ్పిటిసి గంగరాజు, పంచాయతీల సర్పంచులు మోస్య, అప్పారావు, సిపిఎం మండల కార్యదర్శి ఎస్ నాగులు, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి దేవుడు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. సమ్మె శిబిరం వద్ద కళారూపాలు, థింసా నృత్యం ప్రదర్శిస్తూ కార్మికులు తమ సమస్యలను అందరికీ అర్థమయ్యేలా చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని టూరిజం కార్మికులు, ప్రజా సంఘాల నేతలు డిమాండ్ చేశారు.

బిజెపి కొమ్ము కాసే పార్టీలకు తగిన శాస్తి

- ప్రజా రక్షణ భేరి సభను జయప్రదం చేయండి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న మంతెన సీతారామ్, చిత్రంలో సిపిఎం జిల్లా కార్యదర్శి కిరణ్ తదితరులు

ప్రజాశక్తి-చింతూరు

రాష్ట్రానికి ద్రోహం చేస్తున్న, దేశంలో ఉన్మాదాన్ని రెచ్చగొడుతున్న, ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేస్తున్న బిజెపి పల్లకిని వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు మోస్తున్నాయని, ఆ పార్టీలకు తగిన బుద్ధి చెప్పాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం పిలుపునిచ్చారు. స్థానిక శ్యామల వెంకటరెడ్డి స్మారక భవనంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రం విడిపోయి పదేళ్లు కావస్తున్నా అభివృద్ధి శూన్యమన్నారు. ఎపికి ప్రత్యేక హోదా, పోలవరం జాతీయ ప్రాజెక్టు, కడప ఉక్కు ఫ్యాక్టరీ, రాజధాని నిర్మాణం, విశాఖ రైల్వే జోన్ వంటి విభజన హామీలను బిజెపి తుంగలో తొక్కిందని తెలిపారు. వీటిని సాధించడంలో గత టిడిపి, నేటి వైసిపి ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయన్నారు. బిజెపి పాలనలో దళితులకు, మైనార్టీలకు భద్రత లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. బిజెపి చాప కింద నీరుల ఏజెన్సీలో కూడా మతోన్మాద పరిస్థితులను తీసుకొచ్చే ప్రమాదం ఉందన్నారు. జగన్మోహన్‌రెడ్డి, చంద్రబాబులు మోడీ ముందు వణికిపోతున్నారని ఎద్దేవా చేశారు. బిజెపి అనకొండ లాంటిదని, అన్ని పార్టీలను మింగేసి, ప్రజల హక్కులను, స్వేచ్ఛను హరిస్తుందని, ఇప్పటికైనా జగన్, చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు కళ్లుతెరవాలని హితవుపలికారు.

రాష్ట్రంలోని వైసిపి పాలనలో ప్రజలకు ప్రశ్నించే హక్కు లేకుండా పోయిందన్నారు. వైసిపీ ప్రభుత్వ విద్యా విధానంతో ప్రభుత్వ పాఠశాలలో మూతపడ్డాయని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో సిబ్బంది లేక వైద్యం అందడం లేదని తెలిపారు. మాట తప్పను మడమ తిప్పను అని చెప్పిన జగన్, రాష్ట్రంలో రెండు లక్షల 50 వేల ఉద్యోగాలు ఇస్తానని చెప్పి మడత తిప్పారని, ఆయన మాటలను ప్రజలు ఇక నమ్మబోరని, రానున్న కాలంలో తగిన శాస్తి జరుగుతుందని చెప్పారు. నేడు ఆంధ్ర రాష్ట్రంలో ఉపాధి, ఉద్యోగాలు లేక ప్రజలు ఇతర ప్రాంతాలకు వలసబాట పట్టారన్నారు. ఈ సమస్యలను వెలుగెత్తి చాటడంలోనూ, వీటిపై పోరాటం చేయడంలోనూ ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న తెలుగుదేశం పూర్తిగా విఫలమైందన్నారు. ప్రమాదంలో పడిన రాష్ట్ర భవిష్యత్తును, విశాఖ ఉక్కును కాపాడుకోవాలంటే, విభజన హామీలను అమలు అయ్యేలా చూడాలంటే ఈ నెల 15న ప్రజారక్షణ భేరి పేరుతో విజయవాడలో సిపిఎం చేపట్టిన బహిరంగ సభకు వేలాదిగా తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్, జిల్లా కమిటీ సభ్యులు పల్లపు వెంకట్, మండల కార్యదర్శి సీసం సురేష్, నాయకులు సోడే కమలమ్మ పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో జర్మనీ దేశస్తుల సందడి

ప్రజాశక్తి -సీలేరు : జర్మనీ దేశానికి చెందిన వారు ఆంధ్ర ఒడిశా సరిహద్దు గిరిజన గ్రామాల్లో ఆది, సోమవారాల్లో పర్యటించి సందడి చేశారు. ఎఒబిలోని రాసిబేడ గ్రామానికి వచ్చిన వారికి స్థానిక గిరిజనులు తమ సంప్రదాయ రేలా నృత్యంతో స్వాగతం పలికారు. జర్మనీలు గిరిజనులతో ఆటపాటలతో అలరించారు. అనంతరం వారు గిరిజనులతో సమావేశమై వారి ఆచారాలు, కట్టుబాట్లు అడిగి తెలుసుకున్నారు. రాసి బేడలో దీపావళి రోజు గిరిజనులతో కలిసి టపాలు కాలుస్తూ సందడి చేశారు. వారి వెంట బిసఫ్ డాక్టర్ కేఆర్ సింగ్, జూనియర్ బిషప్ కె.జాకబ్, సీలేరు యుసిఐఎం పాస్టర్ మనసై, డేవిడ్ పాస్టర్ ఉన్నారు.

సంప్రదాయ దుస్తులతో ఉన్న గిరిజనులతో జర్మనీ దేశస్తులు

సీలేరు బాలాజీ లాడ్జిలో..

జీకే వీధి మండలం సీలేరు బాలాజీ లాడ్జిలో జర్మనీలు విడిద చేశారు. వారికి లాడ్జి యజమాని నక్క జ్ఞానేశ్వరరావు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా లాడ్జి ఆవరణలో బాణసంచా కాల్చి దీపావళి సంబరాలు వైభవంగా జరుపుకున్నారు. దీపావళి సంబరాల్లో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందని వారు సంతృప్తిని వ్యక్తం చేశారు.

గిరిజన గ్రామాల్లో విద్యుత్ సౌకర్యం కల్పించాలని

వినూత్న నిరసన

ప్రజాశక్తి- అనంతగిరి: చీకటి రోజులు పోవాలని, విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేసి తమ గ్రామాల్లో వెలుగులు నింపాలని డిమాండ్ చేస్తూ నూనెతో దీపాలు వెలిగిస్తూ దీపావళి రోజున విన్నుత్న రీతిలో గిరిజనులు నిరసన చేపట్టారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పరిధి నాన్ షెడ్యూల్ ప్రాంతాలైన రొంపల్లి, ఎన్ఆర్ పురం పంచాయతీల పరిధి కొండ శివారు గ్రామాలైన బూరిగ, చిన్నకోనెల, బొంగిజ, సిమ్ముడివలస, డేంజనివలస, గూడెం, రాయపాడు, దెబ్బలపాడు గ్రామాల్లో సుమారు 2000 మంది జనాభా ఉన్నారు. నేటి వరకు ఆ గ్రామాలకు ఎటువంటి విద్యుత్ సౌకర్యం ప్రభుత్వం కల్పించ లేదు. ఎన్నికల సమయంలో తమ కాళ్ళు, వేళ్ళ పట్టే నాయకులు తమ సమస్యలు పరిష్కరించ లేదని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రుల సమయంలో విషపూరితమైన అటవీ జంతువులు దాడికి పాల్పడుతున్నాయని తెలిపారు. రాత్రి సమయంలో ఇంటి నుండి బయటకు వెళ్ల లేని పరిస్థితిలో బిక్కుబిక్కు మంటూ గడుపుతున్నామని, ఇప్పటికైనా ప్రభుత్వం తక్షణమే స్పందించి విద్యుత్ సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. లేకుంటే మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని గిరిజనులు స్పష్టం చేశారు ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ కొనపర్తి సింహాచలం, గ్రామస్తులు సోమెల, అప్పలరాజు బూరిగ, పెంటయ్య, గిరిజనులు పాల్గొన్నారు

దీపాలతో నిరసన తెలుపుతున్న గిరిజనులు

బతుకుదెరువుకు వలసబాట

- రాజస్థాన్ నుంచి చింతూరుకు వచ్చిన ఐదు కుటుంబాలు
- ఇనుము పనిముట్లు తయారీ, విక్రయంతో జీవనం

చింతూరులో ఇనుము పనిముట్లు తయారీ, విక్రయం చేస్తున్న రాజస్థాన్ రాష్ట్రం వాసులు

ప్రజాశక్తి-చింతూరు

'కమ్మరి కొలిమి, కుమ్మరి చక్రం, జాలరి పగ్గం, సాలెల మగ్గం, శరీర కష్టం స్ఫూరింపచేసే.. గొడ్డలి, రంపం, కొడవలి, నాగలి సహస్ర వృత్తుల సమస్త చిహ్నాలు' అని శ్రీశ్రీ దేశంలో చేతివృత్తులను కీర్తిస్తూ రాసిన కవిత్వం ఇక్కడ గుర్తు రాకమానదు. భాష, ప్రాంతం వేరైనా.. జీవన పోరాటం ముందు అన్నీ బలాదూర్. ఆధునిక యుగంలో మరయంత్రాలతో పోటీపడి ఎండకు, చలికి తట్టుకొని కమ్మరి పని చేస్తూ జీవన పోరాటం సాగిస్తున్నారు.

రాజస్తాన్ రాష్ట్రానికి చెందిన ఐదు కుటుంబాలు పిల్లాజల్లతో ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండల కేంద్రానికి ప్రతి ఏటా శీతాకాలంలో వలస వస్తున్నారు. ఇక్కడ రోడ్డుపైనే వంటా వార్పు చేసుకొని జీవనం సాగిస్తున్నారు. ఆడ, మగ, పిల్లలు, ముసలి అన్న తేడా లేకుండా అందరూ కష్టపడతారు. ఇనుమును కొలిమిలో కాల్చి రకరకాల పనిముట్లు తయారు చేస్తున్నారు. కఠినమైన ఇనుమును కరిగించి కావలసిన రీతిలో మలచి పనిముట్లు తయారు చేసే వీరికి తమ జీవితాలు ఎలా మలుచు కోవాలో తెలియదు. సంచార జాతి వలె చలికి, ఎండకు తట్టుకొని బతుకు బండి లాగుతున్నారు. పండు ముసలి మొదలు పాలుతాగే పిల్లలు వరకు ఇదే పనిలో ఉంటున్నారు. లారీ కమాన్ ముక్కలు కేజీ రూ.30 చొప్పున కొనుగోలు చేస్తారు. కొలిమి కాల్చడానికి బొగ్గును కొంటారు. వీటి ద్వారా కొలిమి కాల్చి వివిధ రకాల ఇనుము పనిముట్లు తయారు చేసి విక్రయిస్తున్నారు. రోజుకు సుమారుగా రూ.5వేలు నుండి రూ.7వేలు వరకు అమ్మకాలు ఉంటాయని మహేందర్ సింగ్ తెలిపారు. పెట్టుబడి పోను మిగిలింది వీరి కష్టానికి ప్రతిఫలం.

అధిష్టానం ఆదేశిస్తే పోటీకి సిద్ధం

-యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు సూరిబాబు

ప్రజాశక్తి - చింతపల్లి: అధిష్టానం ఆదేశిస్తే ఆరకు పార్లమెంట్ నుంచి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసేందుకు తాను సుముఖంగా ఉన్నట్లు యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు, పీసీసీ డెలిగేట్ కొర్రా సూరిబాబు తెలిపారు. మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో పార్టీ శ్రేణులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సూరిబాబు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వంలోనే ఎన్నో చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకోవడం జరిగిందన్నారు. ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ ప్రధాన మంత్రులుగా చరిత్రలో గుర్తుండిపోయే కార్యక్రమాలు చేశారన్నారు. దేశాన్ని గాడిలో పెట్టాలంటే మరలా కేంద్ర, రాష్ట్రాలలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావలసిన అవసరం ఉందన్నారు. రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర చేసి కాంగ్రెస్ శ్రేణులలో జోస్ నింపారన్నారు. పాడేరు శాసనసభ నియోజకవర్గ అభ్యర్థిగా వంతల సుబ్బారావు అభ్యర్థిత్వం దాదాపు ఖరారు కావడంతో అధిష్టానం ఆదేశిస్తే అరకు పార్లమెంట్ అభ్యర్థి పోటీకి తాము సిద్ధంగా ఉన్నట్లు ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కంకిపాటి వీరన్న పడాల్, ఆదివాసీ విభాగం రాష్ట్ర కో ఆర్డినేటర్ వంతల గోపినాధ్, పార్టీ మండల అధ్యక్షులు లకే వెంకటరమణ, సోషల్ మీడియా జిల్లా అధ్యక్షుడు, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రీమల రాజేష్, పార్టీ సీనియర్ నాయకులు గెమ్మెలి రామ చందర్‌రావు, సొమెల్ రాంబాబు పాల్గొన్నారు.

గిరిజనుల ఆందోళన

ప్రజాశక్తి-జి.మాడుగుల: మండలంలోని ఉరుము గ్రామం చుట్టుపక్కల గ్రామాల్లో నల్ల రాయి క్వారీ తవ్వకాలను ఆపాలని ఆయా గ్రామస్తులు సోమవారం క్వారీ వద్ద ఆందోళన చేపట్టారు. క్వారీ ఏర్పాటుతో కాపీ తోటలు, మిరియాలు, వరి పంటలు దెబ్బతింటున్నాయన్నారు. దీంతో పంటలు కూడా సరిగా పండ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పంటలు పండక పోవడంతో ఆర్థికంగా నష్ట పోతున్నామని ఆయా గ్రామాల గిరిజనులు తెలిపారు. ప్రభుత్వం, అధికారులు తక్షణమే ఆ క్వారీని తవ్వకాలను ఆపాలని రైతులు, ఆంధ్ర ప్రదేశ్ గిరిజన సమాఖ్య జిల్లా సహా కార్యదర్శి సిగ్గే లక్ష్మణ్ డిమాండ్ చేశారు.

ఆందోళన చేపడుతున్న గిరిజనులు

2500 లీటర్ల బెల్లం పులుపు ధ్వంసం

ప్రజాశక్తి- కొయ్యూరు : మండలంలోని రత్నంపేట గ్రామ శివారులో నాటుసారా తయారీ బట్టీలపై పోలీసులు దాడులు నిర్వహించి 2,500 లీటర్ల బెల్లం పులుపును ధ్వంసం చేశారు. ఎస్ఐ రాజారావు కథనం ప్రకారం... పోలీసులకు అందిన సమాచారం మేరకు, సీఐ ఏ.స్వామినాయుడు ఆధ్వర్యంలో సిబ్బందితో సోమవారం నాటుసారా తయారీ బట్టీలపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో బెల్లం పులుపుతో పాటు, నాటుసారా తయారీ బట్టీలను, వంట సామాగ్రిని, నాటుసారా నిల్వ ఉంచే డ్రమ్ములను ధ్వంసం చేశారు. రత్నంపేట గ్రామంలో నాటుసారా తయారీకి పాల్పడుతున్న వారిని గుర్తించి, వారిపై చర్యలు తీసుకుంటామని ఎస్ఐ చెప్పారు. ఎవరైనా నాటుసారా తయారీ, క్రయ విక్రయాలకు పాల్పడితే చట్ట ప్రకారం కఠిన తప్పవని ఎస్సై రాజారావు హెచ్చరించారు.

పోలీసులు స్వాధీనం చేసుకున్న నాటుసారా తయారీ మెటీరియల్

పంటలు నష్టపోయిన గిరి రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి -సీలేరు : తీవ్ర వర్షాభావం వల్ల పంటలు ఎండిపోయి ఆర్థికంగా నష్టపోయిన గిరిజన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని బాధిత రైతులు మండి లైకాన్, గురుమూర్తి డిమాండ్ చేశారు. సోమవారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ జీకే వీధి మండలం సీలేరు మేజరు పంచాయతీ పరిధి చింతపల్లి క్యాంప్, లైకాన్‌పుర్, చంద్రుపల్లి గ్రామాల్లో సుమారు 35 ఎకరాల్లో మినప, రాగులు, సామలు, వరి పంటలు సాగు చేశామని తెలిపారు. విత్తనాలు చల్లి మొక్కలు మొలకెత్తిన తర్వాత వర్షాలు లేకపోవడంతో పంటపోలాలు ఎండిపోయి తీవ్రంగా నష్టపోయామన్నారు. పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదని, చేసిన అప్పులు తీర్చే స్థోమత లేక అప్పుల పాలయ్యే పరిస్థితి నెలకొందని వాపోయారు. ఈ ఏడాది తమ కుటుంబ జీవనం కూడా కష్టమేనని, దుర్భరమైన పరిస్థితి చవిచూడవలసి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి పంట పొలాలను పరిశీలించిన, పంట నష్టాన్ని అంచనా వేసి నష్టపరిహారాన్ని చెల్లించాలని డిమాండ్ చేశారు. జీకే.వీధి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి రైతులని ఆదుకోవాలని కోరారు. ఈ సమావేశంలో గిరిజన రైతులు శ్రీను, అప్పారావు, భాస్కరరావు, జగ్గు, లైకాన్ పాల్గొన్నారు.

ఎదుగుదల లేని మినుము పంటను చూపుతున్న రైతులు

యుటిఎఫ్ జిల్లా కార్యదర్శిగా దేముడు

ప్రజాశక్తి- అనంతగిరి:అల్లూరి సీతారామరాజు జిల్లా యుటిఎఫ్ జిల్లా కార్యదర్శిగా రెండవసారి ఏకగ్రీవంగా పుడిగి దేముడు ఎన్నిక అయ్యారు. ఈ మేరకు మండల యుటిఎఫ్ నేతలు హర్ష వ్యక్తం చేశారు. ఈనెల 11న అల్లూరి సీతారామరాజు జిల్లా రాజ ఒమ్మంగిలో జరిగిన యుటిఎఫ్ కౌన్సిలర్ మహాసభల్లో బుడిగి, దేముడును జిల్లా కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకొంటూ తీర్మానం చేశారు. 2022-23 మొదటిసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 2023-24 సంవత్సరంలో రెండవసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయన మండలంలోని గుమ్మ పంచాయతీ చెరుకు బిడ్డ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా విధులు కొనసాగిస్తున్నారు. ఈ సందర్భంగా దేవుడు మాట్లాడుతూ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

చీరలు పంపిణీ చేస్తున్న వైసిపి నేతలు

చీరల పంపిణీ

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు:మండలంలోని బాబుశాల పంచాయితీ గాజులబంద గ్రామంలో వితంతు, వృద్ధ మహిళలకు చీరలు, జాకెట్లు పంపిణీ చేశారు. అనంతరం గ్రామస్తులతో మండల వైసీపీ పార్టీ అధ్యక్షుడు పాంగి మల్లికార్జున మాట్లాడుతూ, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై అడిగి తెలుసుకున్నారు. కరోనా నాటి నుండి నేటి వరకు ఉచితంగా బియ్యం అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైసిపి నాయకులు కృష్ణ, భీమరాజు, బాలకృష్ణ పాల్గొన్నారు.

ఇళ్లపై వేలాడుతున్న కరెంట్ తీగలు

ప్రజాశక్తి-రోలుగుంట:మండలంలో రత్నంపేట గ్రామంలోని బిసి కాలనీలో ఇళ్లపై కరెంట్ లైన్ ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుం దోనని కాలనీ వాసులు భయాందోళన చెందుతున్నారు.ా ఈ విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని వాపోతున్నారు. గతంలో రెండు సార్లు వైర్లు తెగిపడిపోయాయన్నారు. కింతతాడ అర్జునమ్మ కాలనీ ఇల్లు మంజూరు కాగా లెంటల్ లెవెల్ వరకు నిర్మాణం జరిపి శ్లాబ్ వేయుటకు అడ్డంగా ఉండటంతో నిర్మాణంకు ఆటంకంగా మారింది. ఇప్పటికైనా స్పందించి ఎలక్ట్రికల్ లైన్లు సరి చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

సూక్ష్మ కళాకారుని ప్రతిభ : చెక్కతో బాలల ఆకృతులు

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని చినదొడ్డుగల్లు గ్రామానికి చెందిన సూక్ష్మ కళాకారులు దార్ల రవి తన సూక్ష్మకళ తో అబ్బురు పరుస్తున్నాడు. నవంబర్ 14న బాలల దినోత్సవ సందర్భంగా బాలలు ఆడుతున్నట్లుగా చెక్క పై చెక్కి తన సూక్ష్మ కళను ఆవిష్కరించాడు. బాలల దినోత్సవం సందర్భంగా బాలలకు తన సూక్ష్మకళతో శు భాకాంక్షలు తెలియజేశాడు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి-చీడికాడ:మండలంలోని వరహాపురం హైస్కూల్‌కి చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి కత్తి సాము పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల అనకాపల్లి ఎన్టీఆర్ స్టేడియంలో కత్తి సాము పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో పాఠశాలకు చెందిన పడాల ఊర్మిల, బద్ది లలిత, విసారపు కృష్ణవేణి, పి.రూపేష్, పడాల హర్షవర్ధన్, సిరసపల్లి గౌతమ్ ప్రతిభ కనబరిచి రాష్ట్ర పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల వ్యాయమ ఉపాధ్యాయుడు సింహాచలం తెలిపారు. రాష్ట్ర స్థాయి కత్తి సాము పోటీలు ఈనెల 15, 16, 17 తేదీల్లో కర్నూలు జిల్లా నంద్యాలలో జరుగుతాయి. విద్యార్థులను వైస్ ఎంపీపీ స్వాతి, సర్పంచ్ చిన్నమ్మలు, మండల వైసీపీ కన్వీనర్ గొల్లపల్లి రాజుబాబు, ప్రధానోపాధ్యాయులు వరహమూర్తి అభినందించారు.

అమర్‌నాథ్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఇళ్ల స్థలాల జిఒను సవరించండి

పజాశక్తి - కలెక్టరేట్ : జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తూ విడుదల చేసిన జిఒను సవరించాలని కోరుతూ రాష్ట్ర ఐటి శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు విశాఖ అక్రిడేటెడ్ వర్కింగ్ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ ప్రతినిధులు వినతిపత్రం సమర్పించారు. జిఒ నెంబర్ 395/2023లో ఉన్న కొన్ని నిబంధనలు కారణంగా అత్యధిక శాతం మంది జర్నలిస్టులు ఎటువంటి లబ్ధీ పొందలేరని ఆయన దృష్టికి తీసుకు వెళ్లారు. మంత్రి నివాసంలో సోమవారం ఆయనను కలిసిన సొసైటీ ప్రతినిధులు జిఒలో ఉన్న కొన్ని నిబంధనలను సడలించాలని కోరారు. ముఖ్యంగా జర్నలిస్టుల ఆర్థిక పరిస్థితి రీత్యా 60 : 40 ప్రాతిపదికన రూపొందించిన నిబంధనను అందరికీ అనువుగా ఉండేలా 90 :10 నిష్పత్తిలో చెల్లించేలా నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గతంలో జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీలకు ఇచ్చిన నిబంధనలను పరిగణలోకి తీసుకొని ఇప్పుడు వాటిని వర్తింపజేయాలని కోరారు. గతంలో ప్రభుత్వం నుంచి ఇళ్ల స్థలాలు పొందిన వారిని మినహాయించవచ్చని, కానీ భార్య పేరునగానీ భర్త పేరునగానీ ఇళ్ల స్థలం, ఫ్లాట్, ఇల్లు ఉంటే అనర్హులని ప్రకటించడం వల్ల ఎనభై శాతానికి పైగా జర్నలిస్టులు నష్టపోతారని వివరించారు. ఆ నిబంధనను తొలగించేలా కృషి చేయాలని కోరారు. 2023లో అక్రిడేషన్ లేని జర్నలిస్టులకు సీనియార్టీ ప్రాతిపదికన ఇళ్ల స్థలాల కేటాయింపునకు అర్హులుగా చేర్చాలని విజ్ఞప్తి చేశారు. ఇళ్ల స్థలాల ప్రక్రియను మరింత వేగవంతం చేయడానికి వీలుగా దరఖాస్తు చేసుకునే సమయాన్ని ఆరు వారాల నుంచి మూడు వారాలకు తగ్గించాలని కోరారు. విశాఖ నగరానికి దగ్గరలో, నివాసయోగ్యం ఉన్నచోట స్థలాల కేటాయింపు జరిగేలా చూడాలన్నారు. ఏజెన్సీ ప్రాంతాలలో 1/70 నిబంధన అమల్లో ఉన్నందున అక్కడ పనిచేస్తున్న జర్నలిస్టులకు ఎదురవుతున్న అడ్డంకుల నేపథ్యంలో మైదాన ప్రాంతాలలో ఇళ్ల స్థలాలు కేటాయించాలని మంత్రిని కోరారు.

15 నుంచి భారత్ - ఆసీస్ టి 20 టికెట్లు అమ్మకం

ప్రజాశక్తి - పిఎం.పాలెం : విశాఖపట్నంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఎసిఎ - విడిసిఎ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ఈ నెల 23న జరిగే ఇండియా, ఆస్ట్రేలియా టి - 20 అంతర్జాతీయ మ్యాచ్ కోసం 15, 16 తేదీల్లో ఉదయం 11 గంటల నుంచి పేటీఎం (insider.in) లింక్ ద్వారా ఆన్‌లైన్‌లో టిక్కెట్లు విక్రయించనున్నట్లు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఎసిఎ) కార్యదర్శి ఎస్ఆర్.గోపీనాథ్‌రెడ్డి వెల్లడించారు. అదే విధంగా 17, 18 తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి విశాఖపట్నంలోని పిఎం.పాలెంలో ఉన్న డాక్టర్ వైఎస్ఆర్ ఎసిఎ - విడిసిఎ క్రికెట్ స్టేడియంలోని 'బి' గ్రౌండ్, వన్‌టౌన్‌లో ఉన్న ఇందిర ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియం, గాజువాక రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కౌంటర్ల ద్వారా ఆఫ్‌లైన్‌లో టిక్కెట్లు విక్రయిస్తామని తెలిపారు. ఆన్‌లైన్‌లో టిక్కెట్లు కొనుగోలు చేసిన వారు ఆయా కౌంటర్లలో 19వ తేదీ నుంచి 23వ తేదీ వరకు రెడీమ్ చేసుకోవచ్చునని వెల్లడించారు. రూ.600, రూ.1500, రూ.2000, రూ.3000, రూ.3500, రూ.6000, విలువగల టిక్కెట్లు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు.

ప్రపంచ కప్ సెమీ ఫైనల్ వీక్షించేందుకు బిగ్ స్క్రీన్లు

భారత్, న్యూజిలాండ్ మధ్య జరిగే ప్రపంచ కప్ సెమీఫైనల్ మ్యాచ్‌ను తిలకించేందుకు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఎసిఎ) ఆధ్వర్యంలో ఈ నెల 15వ తేదీ మధ్యాహ్నం 1.30 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు రాష్ట్రంలోని మూడు నగరాల్లో పెద్ద స్క్రీన్లు ఏర్పాటు చేస్తున్నట్లు గోపీనాథ్‌రెడ్డి వెల్లడించారు. అందులో భాగంగా వైజాగ్ ఆర్కే బీచ్ వద్ద కాళీ మాత టెంపుల్ ఎదురుగా, విజయవాడ ఎంజి రోడ్డులో ఉన్న ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియం, వైఎస్ఆర్ కడపలోని ఆర్ట్స్ కాలేజీ గ్రౌండ్‌లలో ఒక్కో చోట దాదాపు 10 వేల మంది వీక్షించేలా పెద్ద స్క్రీన్లను ఏర్పాటు చేశామని, అందులో ప్రవేశం ఉచితమని పేర్కొన్నారు. క్రికెట్ అభిమానులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆరోగ్య ఉప కేంద్రాన్ని ప్రారంభించేదెన్నడో?

ప్రజాశక్తి -దుంబ్రిగుడ: మండలంలోని పోతంగి పంచాయతీ గిరిజనులకు సకాలంలో వైద్య సేవల దించేందుకుగాను ప్రభుత్వం మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న సచివాలయ భవనం పక్కన ఆరోగ్య ఉప కేంద్రం నూతన భవనాన్ని నిర్మించారు. ఈ భవన నిర్మాణాన్ని పూర్తి చేసి సుమారు రెండేళ్లు గడుస్తున్నా ఇప్పటికీ ప్రారంభించలేదు. ప్రభుత్వం లక్షలాది రూపాయలు ఖర్చుపెట్టి నిర్మించిన భవనం ఎందుకు పనికి రాకుండా మూలన పడి ఉంది. దీనిపై సంబంధిత అధికారులు కూడా దృష్టి సారించకపోవడంతో భవనం నిరుపయోగంగా మారింది. ఇక్కడ ఎంఎల్‌హెచ్‌పి, హెల్త్ అసిస్టెంట్, ఏఎన్ఎం అందుబాటులో ఉండి గిరిజనులకు వైద్య సేవలు అందించాల్సి ఉంది. భవనం ప్రారంభించకపోవడంతో వారు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోనే ఉంటూ వైద్య సేవలు అందిస్తున్నారు.

మండల కేంద్రంలోనే ఆరోగ్య ఉప కేంద్ర భవనం నిర్మించడంతో ఎవరు కూడా దీనిని పై దృష్టి సారించ లేదు. ఈ భవనం ప్రారంభిస్తే చిన్న చిన్న జలుబు, దగ్గు ఉంటే వ్యాధులతో బాధపడే వారికి, పంచాయతీ గిరిజనులకు అందుబాటులో సౌకర్యంగా ఉంటుంది. తక్షణమే అధికారులు స్పందించి నూతనంగా నిర్మించిన భవనాన్ని ప్రారంభించాలని పంచాయతీ గిరిజనులు కోరుతున్నారు.

నిరుపయోగంగా ఉన్న ఆరోగ్య ఉప కేంద్ర భవనం

శిథిల వంతెనపై భారీ వాహనాలు

ఆందోళనలో ప్రజలు
పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి -కోటవురట్ల:మండలంలో జల్లూరు వరహా నదిపై శిథిలావస్థకు చేరుకున్న వంతెన పైనుంచి సుమారు 40 టన్నుల బరువు ఉన్న భారీ వాహనాల రాకపోకలు సాగిస్తుండటంతో ప్రజలు, వాహనదారులు, విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బ్రిటీష్ కాలంలో నిర్మించిన ఈ వంతెన శిథిలావస్థకు చేరుకోవడంతో 2014లో పాత వంతెన పైనుంచి రాకపోకలు నిషేధించి సుమారు 50 లక్షలు వెచ్చించి డైవర్షన్ రోడ్డు సైతం ఏర్పాటు చేసి వాహనాలు దారి మళ్లించారు. అది కూడా మూడు నాళ్ల ముచ్చట కావడంతో డైవర్షన్ రోడ్డు నీటిపాలైంది. అనంతరం మంజూరైన వంతెన పనులు దాదాపు పూర్తి కావచ్చినా అప్రోచ్ రోడ్ల నిర్మాణం పనుల వద్ద ఆగి పోవడంతో వాహనాలు యధావిధిగా పాత వంతెన పైనుంచి ప్రస్తుతం రాకపోకలు సాగిస్తున్నాయి. వంతెన శిథిలావస్థకు చేరుకోవడంతో గోతుల మయం కావడంతో వాహనాలు వెళ్ళేటప్పుడు వంతెన ఊగి పోతోంది. నర్సీపట్నం వెళ్లే స్కూల్ బస్సులు, ఆర్టీసీ బస్సులు నిత్యం రాకపోకలు సాగిస్తూ ఉంటాయి. దీంతో వాహనదారులు, ప్రయాణికులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు, నాయకులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోలేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అందని పింఛన్లు

ప్రజాశక్తి -రావికమతం:సచివాలయ సిబ్బంది నిర్వాహకంతో మండలంలో కవగుంట గ్రామంలో ఐదుగురు పింఛనుదారులకు ఈనెల పింఛను సొమ్ముకు అందలేదు. మండలంలో కొమిర సచివాలయ పరిధిలో కవగుంట గ్రామపంచాయతీలో నలుగురు వృద్ధులు, ఒక వికలాంగుడుకి పింఛను అందక పోవడంతో సర్పంచు దాసరి సూర్యకుమారి, సచివాలయ కన్వీనర్ దాసరి వరహాలు వద్ద తమ ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో సచివాలయ సిబ్బందిని సర్పంచు అడిగి తెలుసుకోగా వీరికి పింఛన్లు అందలేనట్లు తెలిపారు. వాలంటీర్ను అడగగా తమ లాగిన్ లో వచ్చిన పెన్షన్లన్నీ కూడా పంపిణీ చేయడం జరిగిందని, వెల్ఫేరు, సచివాలయ సిబ్బంది ఇవ్వవలసిన పెన్షన్లు మాత్రమే ఉండిపోయాయని తెలిపారు. గ్రామానికి చెందిన బీరా బాపనమ్మ, బొట్ట చిన్న తల్లి, దాసరి నూకాలమ్మ, శానాపతి కొండమ్మలు వృద్ధాప్య పింఛన్లు కాగా రబ్బా సత్తిబాబు వికలాంగు పిచును అందలేదు. నెలకు ఒకమారు అందించే పెన్షన్ అందక పోవడంతో లబోదిబోమంటున్నారు. తమ ఐదుగురి పెన్షన్స్ సచివాలయ సిబ్బంది లాగిన్‌లో ప్రతినెలా వచ్చి ఇస్తున్నారన్నారు. ఈనెల సచివాలయ సిబ్బంది రాకపోవడంతో వారు ఆందోళన చెందుతున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రతినెలా 1వ తేదీనే పెన్షన్ సొమ్మును గ్రామాలకు పంపిస్తే ఆ సొమ్మును ఇవ్వక పోవడం బాదాకరమన్నారు.సచివాలయం సిబ్బంది కనీసం గ్రామం వైపు కన్నెత్తి చూడకపోవడం చాలా దారుణమన్నారు. పింఛను సొమ్మును చెల్లించాలని, లేనిపక్షంలో ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తామని సర్పంచ్ హెచ్చరించారు. కొమ్మెర సచివాలయ సిబ్బంది సరిగా పనిచేయలేదని, అధికారులకు ఇదివరకే తెలియపరచడం జరిగిందన్నారు. అయినప్పటికీ వారి పనితీరులో ఎటువంటి మార్పు లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

పట్టాలివ్వాలని నిరసన

ప్రజాశక్తి -కొత్తకోట:కొత్తకోట కోళ్ల ఫారం ఎస్సీ లబ్ధిదారులకు తక్షణమే పట్టాల మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం స్థానిక పంచాయతీ కార్యాలయం వైఎస్ఆర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా దళిత బహుజన శ్రామిక సంఘం జిల్లా అధ్యక్షులు మల్లేటి రాజు మాట్లాడుతూ, గత 35 కింద దళితులకు సుమారు 20 మందికి జీవన ఆధారం కోసం కోళ్ల పెంపకం షెడ్డులు నిర్మాణం చేసారని తెలిపారు. నష్టాల కారణంగా కోళ్ల పెంపకం నిలిచి పోయిందని రాజు వివరించారు. తమకు కేటాయించిన స్థలానికి నేటికీ హక్కు కల్పించ లేదన్నారు. పలు మార్లు అధికారుల దృష్టి కి తెలిపినా పరిష్కరించలేదని ఆరోపించారు. రెండేళ్ల కింద చోడవరం ఎమ్మెల్యే కు వినతిపత్రం ఇవ్వగా రెవెన్యూ అధికారులకు సిపార్స్ లెటర్ ఇచ్చారని పేర్కొన్నారు. ఇంత వరకూ రెవెన్యూ అధికారులు స్పందించ లేదని చెప్పారు.అంతకు ముందు వైఎస్ ఆర్ విగ్రహనికి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో కోళ్ల ఫారం లబ్ధిదారులు చెక్క రాజారావు, నాగు, మల్లేటి రాజా, గెడ్డం శ్రీను, బుంగా లోవరాజు, పూడి సత్తిబాబు పాల్గొన్నారు.

సిపిఎం 'ప్రజా రక్షణ భేరి'పై ప్రచారం

ప్రజాశక్తి - కూనవరం

విజయవాడలో ఈ నెల 15న జరుగు సీపీఎం ప్రజా రక్షణ భేరి బహిరంగ సభకు తరలిరావాలని ఆ పార్టీ జిల్లా నాయకులు మేకల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. మండలంలోని ముల్లూరులో ప్రజా రక్షణ భేరిపై ప్రచారం చేశారు. గ్రామంలో ఉపాధి హామీ కూలీలను కలిసి విజయవాడ బహిరంగ సభ ప్రాధాన్యతను వివరించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీలకు రోజు కూలి రూ.600 రూపాయలు, జిఒ 3ను పునరుద్ధరించాలని, పెరుగుతున్న అధిక ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి పాయం సీతారామయ్య, కూటూరు సర్పంచ్ బి.వెంకమ్మ తదితరులు పాల్గొన్నారు.

ముల్లూరులో ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

చింతూరు : మండలంలోని తుమ్మల గ్రామంలో ప్రజా రక్షణ భేరి బహిరంగ సభను జయప్రదంగా చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం, ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ ఆధ్వర్యాన ప్రచారం చేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి సీసం, సురేష్, జిల్లా కమిటీ సభ్యులు పల్లపు వెంకట్ పాల్గొన్నారు.

కరపత్రాలు పంచుతూ ప్రచారం నిర్వహిస్తున్న కొయ్యూరు నాయకులు

విఆర్.పురం : మండలంలోని చిన్నమంటపల్లి పంచాయతీ పరిధి సున్నంమట్క గ్రామంలో ఆదివారం రోజు ప్రజా రక్షణ భేరిపై ప్రచారం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం చిన్నబాబు మాట్లాడుతూ మతోన్మాద బీజేపీని ఓడించాలని, దేశంలో మతాల పేరుతో చిచ్చు పెడుతున్న బీజేపీకి కొమ్ముకాసే ప్రతి రాజకీయ పార్టీని వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు సిహెచ్ సుబ్బారావు పాల్గొన్నారు.

కొయ్యూరు : సిపిఎం ప్రజా రక్షణ భేరి కార్యక్రమానికి తరలి రావాలని సిపిఎం మండల నాయకులు ఎస్.సూరిబాబు ఆధ్వర్యంలో సోమవారం కరపత్రాలు పంచుతూ, గోడపత్రాలు అంటిస్తూ విస్తృత ప్రచార నిర్వహించారు. ప్రజా కార్మిక ఉద్యోగ ఉపాధ్యాయ వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న వామపక్షాలను బలపరచాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు వై.అప్పలనాయుడు, టి.ప్రసాదు, శంకర్, సానా పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీల అరుదైన చేపల వేట 'తేలే'

సమిష్టితత్వానికి తార్కాణంగా గిరిజన సంప్రదాయాలు

ప్రజాశక్తి-చింతూరు

ఆదివాసీల సమిష్ట తత్వానికి వారి ఆచార సంప్రదాయాలతో పాటుగా వివిధ రకాల ఫల సాయం, వేట తార్కాణంగా ఉన్నాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం చదలవాడ గ్రామపంచాయతీ పరిధిలోని కలుసులూరు గ్రామానికి ఆనుకొని ప్రవహిస్తున్న సోకిలేరు వాగులో గూడెం గిరిజనులు చేసే చేపల వేట కూడా ఆదివాసీల సమిష్టితత్వానికి నిదర్శనంగా ఉంది. వాగుకు అడ్డుగా గిరిజన గూడెం ప్రజలందరూ ఏర్పాటు చేసే తేలే అనబడే చేపలు వేటాడే వల చూపరులను ఆకట్టుకుంటుంది.

గూడెం ప్రజలు తమ వారిలో ఎవరికి ఏ కష్టం వచ్చినా చేదోడు వాదోడుగా ఉంటారు. సంతోషం, శుభకార్యాల్లోనూ ఎవరికి తోచిన సహాయం వారు చేస్తూ ఆదుకుంటారు. వివాహ, శుభకార్యాల్లో మేకలను, పశువులను కూడా సహాయంగా అందజేసి గ్రామస్తులంతా శుభకార్యాన్ని ఆనందోత్సవాలతో జరుపుకోవడం పూర్వీకుల నుండి ఆచారంగా వస్తుంది. అలాగే వేసవి కాలంలో గ్రామస్తులందరూ కలిసి విల్లంబులు పట్టుకొని అడవిలో వేటకు వెళ్లడం పరిపాటి.

ఇటువంటిదే సోకిలేరు వాగుపై కలుసులూరు గూడెం ప్రజలందరూ కలిసి తేలే అనబడే అరుదైన చేపలు వేట కూడా. అడవిలో లభించే వెదురు కలపతో తడికలను అల్లి సిద్ధం చేశారు. సోకిలేరు వాగులో బండ రాళ్లను ఏర్పాటు చేశారు. వాగు నీటిలో పది అడుగుల లోతు వరకు కర్రలను పాతి స్తంభాలుగా ఏర్పాటు చేశారు. బలమైన తాళ్ళను ఉపయోగించి అల్లిన తడికలను, ఈతగడ్డి చెట్టు వేర్లను పాతిన కర్రలకు వాగు ప్రవాహానికి అడ్డుగా కట్టారు. వెదురుతో అల్లిన తడికలను ప్రవాహానికి ఎదురుగా ఏటవాలుగా ఏర్పాటు చేయడంతో చేపలు తడికల్లో చిక్కి లోతైన వలలో పడతాయి. నీటి ప్రవాహాన్ని తట్టుకునేలా బండరాళ్లను బలంగా ఏర్పాటు చేశారు. వల ఏర్పాటు చేసిన తరువాత ఒక జంతువును బలి ఇచ్చి వేట ప్రారంభిస్తారు. ఈ విధంగా చిక్కిన చేపలను గూడెం ప్రజలందరూ పంచుకుంటారు. తేలియాడే వల వద్దకు మహిళలను మాత్రం అనుమతించరు. మహిళలు ఆ ప్రాంతంలో తిరిగాడితే చేపలు వలకు చిక్కవని వీరి నమ్మకం.

ఇదేవిధంగా మరికొన్ని ఆదివాసీ గ్రామాల్లో చెరువులు, కుంటల్లో కూడా చేపల వేటకు ఒక రోజును నిర్ణయించుకొని ఇంటిలిపాది చేపల వేట చేసి లభించిన చేపలన్నింటినీ ఒక వద్ద చేర్చి, పోగులు వేసి గ్రామంలో సమానంగా పంచుకుంటారు. అడవిలో జంతువుల వేట, వాగులు, చెరువుల్లో చేపల వేట సమిష్టిగా చేసే సంప్రదాయాలను ఆధునిక కాలంలోనూ ఆదివాసీలు కొనసాగిస్తున్నారు.

చేపల వేటకుగాను వాగులో ఏర్పాటు చేసిన తడికలు

నేరాలు ఘోరాలు

ఏలేరు కాలువలో పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-కశింకోట : ఏలేరు కాలువలో కాలు జారి పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం... మండలంలోని జమాదులపాలెం గ్రామానికి చెందిన కరక రామునాయుడు (57) శనివారం పశువులను మేతకు తీసుకువెళ్లి ఏలేరు కాలువలో వాటిని కడగటానికి దిగాడు. అనుకోకుండా కాలువలో మునిగిపోయాడు. అటుగా వెళుతున్న స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు తెలియపరిచారు. వెంటనే కుటుంబ సభ్యులు అక్కడకు చేరుకొని వెతకగా కనిపించకపోవడంతో పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఏలేరు కాలువలో గాలించగా సోమవారం కసింకోట సమీపంలో మృతదేహం లభించింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు

ఎస్‌పి కెవి.మురళీకృష్ణ

ప్రజాశక్తి -ఎస్.రాయవరం:జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు జిల్లా ఎస్‌పి కెవి మురళీకృష్ణ తెలిపారు. సోమవారం సాయంత్రం అడ్డురోడ్డులోని నక్కపల్లి సర్కిల్ కార్యాలయంను సందర్శించిన ఆయన పలు అంశాలపై స్థానిక విలేఖరులతో మాట్లాడారు. జాతీయ రహదారిపై జరుగుతున్న ప్రమాదాల నివారణకు ఆయా సర్కిల్ పరిధిలోని పోలీస్ స్టేషన్ సిబ్బందికి సూచనలిచ్చామన్నారు. జిల్లాలో గతేడాది అక్టోబర్ నుండి ఈ ఏడాది అక్టోబర్ వరకు 24శాతం ప్రమాదాలు జరగకుండా నివారించామన్నారు. డ్రంక్ అండ్ డ్రయివ్ కేసుల్లో 70శాతం పైనే కేసులు నమోదయ్యాయన్నారు. అవసరమైన చోట సిసి కెమెరాల ఏర్పాటుకు ఆదేశాలిచ్చామన్నారు. జిల్లాలోని ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్ లను ఇప్పటికే సందర్శించామన్నారు. స్టాపర్ బోర్డులు ఏర్పాటు చేసి ట్రాఫిక్ నియంత్రణ, వెలుతురు సరిగా లేని ప్రాంతాలలో లైటింగ్ ఏర్పాట్లు చేసే దిశగా చర్యలు చేపట్టాలని సూచించామన్నారు.రాంగ్ రూటులో వచ్చే వాహనదారులకు అవగాహన కల్పించడంతో పాటు కఠిన చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించామన్నారు. రౌడీషిటర్ల పై మరింత నిఘా పెట్టాలని సూచించారు. ఆయన వెంట నక్కపల్లి సి ఐ అప్పన్న బాబు, నక్కపల్లి యస్ఐ విభీషణరావు ఉన్నారు.

వెంకన్న దర్శించుకున్న ఎస్పీ

నక్కపల్లి:ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన ఉపమాక వెంకన్న ను సోమవారం ఎస్పి మురళీకృష్ణ దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు శేషాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.వెంకన్న జ్ఞాపిక ప్రసాదాలను అందజేశారు. అనంతరం ఎస్పీ నక్కపల్లి పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తగు సూచనలు చేశారు.

అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-యస్.రాయవరం:అపరిచిత వ్యక్తుల పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని స్థానిక ఎస్ఐ పి.ప్రసాదరావు సూచించారు. ఈ మేరకు సోమవారం ప్రకటన విడుదల చేశారు. ఇటీవల చెడ్డి గ్యాంగ్ పేరుతో ఒక ముఠా రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ నేరాలకు పాల్పడుతున్నారన్నారు. కొద్దిరోజుల క్రితం తిరుపతిలో కూడా ఈ ముఠా కదలికలు సిసి ఫుటేజ్ లో కనిపించడం జరిగిందని తెలిపారు. మన జిల్లాలో కూడా ఈ ముఠా నేరాలకు పాల్పడే అవకాశం ఉందన్నారు. రాత్రి పూట ఇళ్ల తాళాలు పగలగొట్టి దొంగతనాలకు పాల్పడటం ఈ ముఠా ప్రత్యేకత అన్నారు. రాత్రి వేళల్లో ఎవరైనా అపరిచితులు తలుపులు కొడితే ఒకటికి పదిసార్లు చూసుకోవాలన్నారు. అనుమానాస్పదంగా ఎవరైనా కనిపిస్తే వెంటనే ఫోన్: 9440796107, 100 నంబర్ కి కాల్ చేయాలని సూచించారు.

కల్వర్టుకు రంధ్రం

ప్రజాశక్తి-రోలుగుంట:చోడవరం నుంచి నర్సీపట్నం వెళ్లే ఆర్అండ్‌బి రోడ్డు కొత్తకోట గజాలకట్టులో కల్వర్టుకు రంధ్రం పడటంతో ప్రయాణికులు, వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఈ రోడ్డుపై 40 నుంచి 50 టన్నుల బరువు గల లారీలు వెళుతుంటాయి. క్వారీ లారీలు, సరుగుడు కర్రలతో వెళుతున్నాయి. దీంతో, ఎప్పుడు ఏమి జరుగుతుందోనని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ కల్వర్టుకు మే నెలలో మట్టి తొలగించారు. ఆ తర్వాత పూర్తిగా జేసిబితో మూసివేయడం జరిగింది. ఈ కల్వర్టు నుండే సాగునీరు కంచుగుమ్మల రెవెన్యూ పరిధిలోని రోడ్డు అవతల పొలాలకు పారుతోంది. అధికారులు దీనిపై దృష్టి సారించి కల్వర్టు రంధ్రం పూడ్చాలని వాహనదారులు కోరుతున్నారు.

విజయవాడ బయలుదేరిన భాషా వాలంటీర్లు

ప్రజాశక్తి-కొయ్యూరు : భాషా వాలంటీర్ల సమస్యలపై అమరావతిలోని సర్వశిక్ష అభియాన్ అధికారులకు విన్నవించేందుకు కొయ్యూరు, చింతపల్లి, జికె.వీధి మండలాలకు చెందిన భాషా వాలంటీర్లు సోమవారం విజయవాడ తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు భాషా వాలంటీర్లను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఏటా రెన్యువల్ చేయాలని, మార్చి ఏప్రిల్ నెలల్లో కూడా కొనసాగించాలని, అన్‌ట్రైన్డ్ వారికి ట్రైనింగుకు నాలుగు సంవత్సరాలు కాలవ్యవధి ఇవ్వాలని కోరారు. విజయవాడ వెళ్లిన వారిలో కొయ్యూరు మండల నాయకులు కె.రమణబాబు, టి.చిట్టిబాబు, ఎం శైలు, చింతపల్లి మండల నాయకుడు పి శ్రీను, ఎస్ సత్తిబాబు, ఎం బాబూజీ, జీకే వీధి నాయకుడు ఎస్ కృష్ణ, ఎం రాంబాబు, వి నాగేశ్వరరావు ఉన్నారు.

రక్షిత మంచినీటి ట్యాంకు ప్రారంభం

ప్రజాశక్తి-కొయ్యూరు : కొయ్యూరు మండలం, మారుమూల బూదరాళ్ళ పంచాయితీ పరిధి, ముకుడుపల్లి గ్రామంలో నవ నిర్మాణ సమితి ఏర్పాటు చేసిన రక్షిత మంచినీటి ట్యాంక్‌ను సోమవారం సర్పంచ్ సాగిన ముత్యాలమ్మ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు వంతల కుమారి, వార్డ్ మెంబర్ సంజీవ్, నాయకులు వంతల మ్రి, వంతల నారాయణ, బాలన్న, గ్రామ వాలంటీర్ సాగిన రమణ, నవ నిర్మాణ సమితి మేనేజర్ ఎం. వీర నాయుడు, సూపర్ వైజర్ ఎల్.కృష్ణ, కమిటీ సభ్యులు నాగేష్, ప్రసాద్, రమేష్, బుజ్జిబాబు, వెంకట్, సత్యనారాయణ పాల్గొన్నారు.

కుళాయి నీటిని విడుదల చేస్తున్న నాయకులు

కమ్యూనిటీ భవన నిర్మాణానికి వినతి

ప్రజాశక్తి- కొయ్యూరు : కొయ్యూరు మండలం పాతపాడి గ్రామంలో అసంపూర్తిగా నిలిచిపోయిన కమ్యూనిటీ భవన నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలని మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు రేగటి ముసిలినాయుడు, డౌనూరు ఎంపీటీసీ సభ్యుడు బిడిజాన అప్పారావు సోమవారం అరకు ఎంపీ గొడ్డేటి మాధవిని కలిసి వినతిపత్రం అందజేశారు. గతంలో గ్రామంలో కమ్యూనిటీ భవన నిర్మాణం ప్రారంభించి అసంపూర్తిగా వదిలేశారని వివరించారు. ఎంపీ మాధవి సానుకూలంగా స్పందించినట్లు వారు చెప్పారు.

పలువురికి ఎమ్మెల్యే వాసుపల్లి సాయం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ప్రతి నెలా నిర్వహించే ప్రజా దర్బార్ కార్యక్రమంలో.. వివిధ ఆరోగ్య సమస్యలతో.. ఆర్థిక సాయం కోరుతూ వచ్చిన అర్జీలను పరిశీలించి తొమ్మిది మందికి రూ.40 వేల ఆర్థిక సాయాన్ని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ అందజేశారు. సోమవారం వారి వారి ఇళ్లకు వెళ్లి పరామర్శించి ఆ మొత్తాలను అందించారు. ఆర్థిక సాయం పొందిన వారిలో 38వ వార్డు బొక్క వీధికి చెందిన గుంటు సత్యవతి, గొరక ఎల్లాజీరావు, 39వ వార్డు తాంమ్‌సన్ స్ట్రీట్‌కు చెందిన కురుమన రెడ్డి, 38వ వార్డు కందుల వారి వీధికి చెందిన బుంగ సత్తిరాజు, 37వ వార్డు చంగళరావు పేటకు చెందిన వాసుపల్లి దివ్య అంజలి, 33వ వార్డు అమ్మవారి వీధికి చెందిన మద్ది శంకర్ రెడ్డి, వివేకానంద కాలనీకి చెందిన నీలాపు వాసంతి, 27వ వార్డుకు చెందిన తనకాల అప్పల శ్రీనివాస్, 27వ వార్డు అశోక్ నగర్‌కు చెందిన కె.ఉదయ ఉన్నారు.

నేడు మద్దిలపాలెంలో నేత్ర వైద్య శిబిరం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రపంచ మధుమేహ దినోత్సవం సందర్భంగా మంగళవారం ఉదయం మద్దిలపాలెంలో ఉన్న శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యాన మద్దిలపాలెం సిఎంఆర్ సెంటర్ ప్రాంగణంలో ఉచిత డయాబెటిక్ రెటినోపతీ పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఫౌండేషన్ నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు 30 సంవత్సరాల పైబడిన వారందరికీ ఉచితంగా సుగర్ పరీక్షలు చేస్తామని, మధుమేహం అధికంగా ఉన్న వారి రెటీనాకు ఫొటో తీయడం ద్వారా వారిలో ఏదైనా కంటిచూపునకు సంబంధించిన సమస్యలు ఉంటే తగిన సలహాలు అందిస్తామని చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.